సంపుటి :02 సంచిక :254 పేజీలు :05
వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com
Voice of the people

మంగళవారం 16, డిసెంబర్ 2025



## రేపే ఆఖరి పోరాటం

- మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- మండల కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు
- బ్యాలెట్ బాక్సులు, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక నిఘా
- తెల్లవారితే పోలింగ్ కావడంతో ప్రలోభాల జోరు
- ఓటర్లకు నగదు, మద్యం, చికెన్ పంపిణీ

02



## 1991 మందితో బందోబస్తు

03

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

మూడో విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ మండలాల్లో జరిగే మూడో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1991మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

- అక్షరదర్బార్, హనుమకొండ

**మన ఇలాకాలో**

స్వగ్రామాలపై ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీ అభ్యర్థుల గురి

## మనోళ్లే గెల్వాలె!

డీసీసీ అధ్యక్షులు ఇనుగాల స్వగ్రామం ఆత్మకూరు, ధన్వంతి స్వగ్రామం మాదాపురంలో బిగ్ ఫైట్



- ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డీసీసీలు
- ఎమ్మెల్సీలు పోచంపల్లి, సిరికొండ స్వగ్రామాల్లోనూ బిగ్ వార్
- ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలనేదే టార్గెట్
- పల్లెల్లో పైచేయి.. సాధించి కేడర్ బలోపేతం చేసేందుకు వ్యూహ రచన
- నిండు చలికాలంలో సెగ పుట్టిస్తున్న ఎలక్షన్ స్టంట్
- సర్వత్రా.. విజేత ఎవరు? అనే ఉత్కంఠ..
- కొన్నిచోట్ల జోరుగా బెట్టింగ్స్

02

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయి స్థాయికి చేరింది. నిండు చలికాలంలో ఎలక్షన్స్ సెగ పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా జనగామ, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్వగ్రామాల్లో టగ్ ఆఫ్ వార్ నడుస్తున్నది. ఆయా గ్రామాల్లో తమ ప్రాభవాన్ని నిలుపుకునేందుకు నేతలు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. తమ పార్టీ బలపరిచన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎంతవరకైనా వెళ్తున్నారు. అంగ, అర్థ, సామాజిక వర్గాల బలాలను వినియోగిస్తున్నారు. తెల్లవారితే పోలింగ్ మొదలు కానుండడంతో ఎలాగైనా గెలిచితీరాల్సిందేనన్న పట్టింపుతో ఉన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ఏ పార్టీకి చెందిన నాయకుడిది పైచేయి అవుతుందనే ఆసక్తి ఏర్పడింది. ప్రధాన నేతల స్వగ్రామాల్లో పోటాపోటీగా ఎన్నికలు జరుగుతున్నందున గెలుపోటములపై కొందరు పందేలు వేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో అన్న ఉత్కంఠను జూదరులు ఆ విధంగా వినియోగించుకుంటున్నారు.


– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## 28 ఎకరాల్లో బస్టాండ్

- జనవరి 25 నుంచి ప్రత్యేక బస్సులు
- ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ వై నాగిరెడ్డి
- మేడారంలో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

04




## వాట్సాప్‌కు కలెక్టర్ డీపీ

డబ్బులు డిమాండ్

సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని

కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి

05

అర్హులకు త్వరలో

## ఇందిరమ్మ ఇళ్లు

- 2200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లనూ కేటాయిస్తాం
- రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ లో రూ.4.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

05



# మన ఇలాకాలో మనోళ్లే గెల్వాలె!

- స్వగ్రామాలపై ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీ అభ్యర్థుల గురి
- డీసీసీ అధ్యక్షులు ఇనుగాల స్వగ్రామం ఆత్మకూరు, ధన్వంతి స్వగ్రామం మాదాపురంలో బిగ్ ఫైట్
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డీసీసీలు
- ఎమ్మెల్సీలు పోచంపల్లి, సిరికొండ స్వగ్రామాల్లోనూ బిగ్ వార్
- ఎలాగైనా గెలవాలనేదే టార్గెట్
- పల్లెల్లో పైచేయి.. సాధించి కేడర్ బలోపేతం చేసేందుకు వ్యూహ రచన
- నిండు చలికాలంలో సెగ పుట్టిస్తున్న ఎలక్షన్ స్టంట్
- సర్వత్రా.. విజేత ఎవరు? అనే ఉత్కంఠ.. కొన్నిచోట్ల జోరుగా బెట్టింగ్స్



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయి స్థాయికి చేరింది. నిండు చలికాలంలో ఎలక్షన్స్ సెగ పుట్టిస్తు న్నాయి. ముఖ్యంగా జనగామ, వరంగల్, హనుమ కొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతిని ధులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్వగ్రామాల్లో టగ్ ఆఫ్ వార్ నడుస్తున్నది. ఆయా గ్రామాల్లో తమ ప్రాభవాన్ని నిలుపుకునేందుకు నేతలు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేం దుకు ఎంతవరకైనా వెళ్తున్నారు. అంగ, అర్థ, సామాజిక వర్గాల బలాలను వినియోగిస్తున్నారు. తెల్లవారితే పోలింగ్ మొదలు కానుండడంతో ఎలాగైనా గెలిచితీరాల్సిందేనన్న పట్టింపుతో ఉన్నా రు. దీంతో ఆయా గ్రామాల్లో సర్వత్రా ఉత్కంఠ నెల కొన్నది. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ఏ పార్టీకి చెందిన నాయకుడిది పైచేయి అవుతుందనే ఆసక్తి ఏర్పడింది. ప్రధాన నేతల స్వగ్రామాల్లో పోటాపో టీగా ఎన్నికలు జరుగుతున్నందున గెలుపోటము లపై కొందరు పందేలు వేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో అన్న ఉత్కంఠను జూదరులు ఆ విధంగా వినియోగించుకుంటున్నారు.

**- ఎమ్మెల్సీలు పోచంపల్లి, సిరికొండ స్వగ్రామాల్లో..**

హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్ గ్రామం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్నిహితుడు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి స్వగ్రామం. ఇదే మండలం నర్సక్కపల్లె ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, స్టేట్ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర రావు, లింగంపల్లి కిషన్‌రావు స్వగ్రామం. ఆయా గ్రామాల్లో గులాబీ జెండా బావుటాను ఎగురవేసేం దుకు పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌ను ఓడించి ఎన్నికల్లో గెలిపించే దుకు ఉవ్విళ్లూరుతున్నాయి. అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నాయి. హనుమ కొండ జిల్లాలోని శాయంపేట మండలం ప్రగతిసిం గారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్వగ్రామం. ఈ గ్రామంలోనూ విజయం ఏ పార్టీ మద్దతుదా రును వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

**- డీసీసీ అధ్యక్షుల ఇలాకాలో..**

ఆత్మకూరు మండల కేంద్రం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి స్వగ్రామం. డీసీసీ పదవి స్వీకరిం చిన వెంటనే వచ్చిన ఎన్నికలు కావడంతో ఆయన పంచాయతీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నారు. తన స్వగ్రామం ఆత్మకూరులో కాంగ్రెస్ జెండా ఎగు రవేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఆయన ఇక్కడ ప్రచారం కూడా నిర్వహించారు. జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి స్వగ్రామం దేవరుప్పల మండలంలోని మాదాపురం. డీసీసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన తర్వాత తొలి ఎన్నికలు కావడంతో ఆమె కూడా పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు.

**- ఇతర నేతల స్వగ్రామాల్లో..**

దామెర మండల కేంద్రం బీజేపీ ముఖ్య నేత గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి స్వగ్రామం. ఇక్కడ బీజేపీ కేడర్ పంచాయతీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంది. ఎన్నికల్లో గెలిచి బీజేపీ బలాన్ని చాటేందుకు ఉవ్వి ళ్లూరుతుంది. అలాగే వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలంలోని అమీనాబాద్ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వగ్రామం. ఇక్కడ గెలుపు ఎవరిదనే అంశంపై ఉత్కంఠ చోటుచేసు కుంది. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండా. తండాలో గులాబీ జెండాను ఎగురవే సేందుకు మాజీ మంత్రి ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

**- మంత్రి శ్రీధర్ బాబు ఇలాకాలో..**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గం లోని కాటారం, మల్హర్, మహముత్తారం, మహదేవ్ పూర్ మండలాల్లోనూ మూడో విడత పోలింగ్ జరు గుతున్నది. ఆయా మండలాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాగైన కాంగ్రెస్ పార్టీ బలపరి చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కేడర్ పని చేస్తున్నది. ప్రతి మండలంలోని మారుమూల పల్లె వరకు కాంగ్రెస్ శ్రేణులు వెళ్తున్నాయి. అభ్యర్థులు కూడా ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో ఉన్నారు.




## పరకాల ఎక్సైజ్ స్టేషన్ లో వాహనాల వేలం



అక్షర దర్బార్, పరకాల: పరకాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబ డిన వాహనాలకు గురువారం (18–12–2025) ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ఆయా వాహనాల అప్‌సెట్ ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వేలం ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## సింగరేణి సీఎండీగా కృష్ణభాస్కర్

**- ముగిసిన బలరాం డిప్యుటేషన్ గడువు**



అక్షరదర్బార్, హైదరాబాద్ : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఇన్‌ఛార్జి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ కు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఇన్‌ఛార్జి సీఎండీగా ఉన్న బలరాం డిప్యుటేషన్ గడువు ఇటీవల ముగియడంతో సర్కార్ ఈ మే. ఈ నేపథ్యంలోనే ఆయన స్థానంలో కృష్ణభాస్కర్‌కు బాధ్యతలు అప్ప గించారు. బలరాం కేంద్ర రెవెన్యూ సర్వీసు అధికారిగా కొనసా గుతూ ఆయన డిప్యుటేషన్‌పై తెలంగాణకు వచ్చారు. ఇక్కడ సింగరేణి సీఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరేళ్లపాటు సేవలందించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే అధికారుల డిప్యు టేషన్ గడువు ఐదేళ్లు మాత్రమే ఉంటుంది. అయినప్పటికీ.. బలరాం ఏడాది పాటు అదనంగా పనిచేశారు. అందుకే, ఆయన గడువు పొడిగింపును రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కేంద్రాన్ని కోరలేదు.

# రేపే ఆఖరి పోరాటం

## మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- మండల కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు
- బ్యాలెట్ బాక్సులు, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక నిఘా
- తెల్లవారితే పోలింగ్ కావడంతో ప్రలోభాల జోరు
- ఓటర్లకు నగదు, మద్యం, చికెన్ పంపిణీ

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : ఉమ్మడి వరంగల్ జిల్లా మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైంది. ఎన్నికల అధికారులు మంగళవారం జిల్లాకేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి సామగ్రి తీసుకుని సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. హనుమకొండ జిల్లా దామెర, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ మండలాలు, వరంగల్ జిల్లాలో నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాలు, భూపాలపల్లి జిల్లాలో కాటారం, మహము త్తారం, మల్హర్, మహదేవపూర్ మండలాలు, ములుగు జిల్లాలో కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో దొర్నకల్, గంగారం, కొత్తగూడ, కురవి, మరిపెడ, సిరోల్ మండలాలు, జనగామ జిల్లాలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.



బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ జరుగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అధి కారులు ఇదేరోజు ఫలితాలను వెల్లడించనున్నారు.

**- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా**

ఉమ్మడి జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలైన వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం వంటి సమస్యాత్మక మండలాలు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పోలీసులు యంత్రాంగం పటిష్ట బందోబస్తు చేపట్టారు. అవి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు కావడంతో ఎన్నికల నిర్వహణను పోలీసు అధి కారులు సవాల్ గా తీసుకున్నారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. వెబ్కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు సివిల్, సీఆర్పీ ఎఫ్ బలగాలను మోహ రించి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా భద్రతా చర్యలు చేపడుతున్నారు.

**- తారాస్థాయికి ప్రలోభాలు**

పోలింగ్ జరుగుతున్న మండలాల్లో ప్రచార హోరు నిలిచిపో యిన వెంటనే సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు చివరి అస్త్రాలైన మందు, మాంసం, నగదు పంపిణీకి తెరతీశారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ జోరుగా తాయిలాల పంపిణీ జరుగుతోంది. ఓటర్లకు ఇచ్చేందుకు అభ్యర్థులు పెద్ద ఎత్తున మాంసం కొనుగోలు చేశారు. మార్కెట్‌లో కోళ్ల కొనుగోళ్లు టాప్ రేంజ్‌కు చేరుకుంది. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా ఓటుకు రూ.500 నుంచి రూ.2 వేల వరకు పంపిణీ చేస్తున్నారు. రిజర్వుడ్ గ్రామాల్లో మాత్రం పోటీ కనుగుణంగా రూ.300, 500, కాస్త అభ్యర్థి అర్థబలం కలిగి ఉంటే రూ.వెయ్యి వరకు ఇస్తున్నారు. ఓటర్లు సైతం ప్రధాన పోటీదారుల ప్రలోభాలను పసిగ డుతూ.. ఎవరు ఎక్కువ ఇస్తే వారికి ఓటేద్దామని ఓటర్లు భావిస్తున్నారు..

# 1991 మందితో బందోబస్తు




## - వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హనుమకొండ: మూడో విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ మండలాల్లో జరిగే మూడో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1991మంది పోలీసులను వినియోగించడం జరుగుతోందని, ఇందులో ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలతో పాటు ఏసీపీలు 16, ఇన్ స్పెక్టర్లు 29, ఎస్ఐలు 131, ఏ.ఎస్.ఐ/హెడ్ కానిస్టేబుళ్లు 339, కానిస్టేబుళ్లు 1218, హోంగార్డ్స్ 258 మంది, వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఎన్నిక వేళ అదనపు డీసీపీ స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారి ఇంచార్జ్‌గా ఉంటారని, రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్.ఐ/ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని సీపీ పేర్కొన్నారు. ఓటర్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ తెలిపా రు. ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లు సమ చారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని ప్రజలకు సూచించారు.

### 18 వరకు నిషేధాజ్ఞలు

**మూడో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈనెల 17న జరిగే మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధించినట్లు ఆయన వెల్లడించారు.**

## మూడో విడత ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

### భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైమ్: మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని కాటారం, ముత్తారం, మహాదేవపూర్, కొయ్యూరు మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 570 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కేంద్రాలను విడిచిపెట్టరాదని ఆదేశించారు. రూట్ మొబైల్ అధికారులు నిరంతర పెట్రోలింగ్ చేపట్టాలని సూచించారు. చిన్న సంఘటనలు జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందని, ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజే కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## గ్రామాల అభివృద్ధికి సర్పంచ్ లు

# ఐక్యంగా పని చేయాలి

- ప్రజల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి
- నూతన సర్పంచ్ లను సన్మానించిన

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, భూపాలపల్లి : గ్రామాల అభివృద్ధికి సర్పంచ్ లు ఐక్యంగా పని చేసి, ప్రజల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో దశలో విజయం సాధించిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఈరోజు భూపాలపల్లి లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లకు, ఉప సర్పంచ్ లకు, వార్డు మెంబర్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనకు ప్రజల సమస్యలు సర్పంచ్ లు వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశ విజయవంతంగా పూర్తి అయిందని, రెండో దశ త్వరలో ప్రారంభం కానుందని చెప్పారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం సరఫరా జరుగుతుందని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటమి చెందిన నాయకులు నిరుత్సాహ పడకుండా, రేపు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు.అంతకుముందు గ్రామాల వారీగా సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు మెంబర్లు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, పూల బొకే లు ఇస్తూ, స్వీట్లు తినిపించారు. ఎమ్మెల్యే కూడా సర్పంచ్ లకు, ఉప సర్పంచ్ లకు, వార్డు మెంబర్లకు శాలువాలు కప్పి, శుభాకాంక్షలు తెలిపారు

## మార్పునకు మారుపేరు లక్ష్మీపురం

### బీఆర్ఎస్ నేత ఆముదాలపల్లి అశోక్ గౌడ్



అక్షరదర్బార్, పరకాల: లక్ష్మీపురం గ్రామం మరోసారి మార్పుకు ప్రతీకగా నిలిచిందని బిఆర్ఎస్ సమన్వయ సమితి నాయకులు ఆముదాలపల్లి అశోక్ గౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్‌గా పల్లెబోయిన గీతారాణి రాజు భారీ మెజార్టీతో విజ యం సాధించడం ద్వారా ప్రజలు బిఆ ర్ఎస్‌పై తమ విశ్వాసాన్ని స్పష్టంగా చా టుకున్నారని పేర్కొన్నారు. తొమ్మిది వార్డుల్లో బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థులందరూ గెలవడం గులాబీ జెండా బలాన్ని చాటిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేకపోవడమే ఈ ఫలితాలకు కారణమని విమర్శించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లోనూ లక్ష్మీపురంలో బిఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## కాలువలో మహిళ మృతదేహం లభ్యం



నర్సంపేట, అక్షరదర్బార్: నర్సంపేట మండలం మాదన్నపేట శివారులోని కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు వృద్ధురాలిగా గుర్తించారు. మంగళవారం ఉదయం కల్లు గీసేందుకు వెళ్లిన ఓ గీత కార్మికుడికి కాలువలో మృతదేహం కనిపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మహిళ వివస్త్రగా ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



## శాంతియుత ఎన్నికలకు సహకరించాలి

అక్షర దర్బార్ శాయంపేట : ఎన్నికలు శాంతియుతంగా జరుగుటకు సహకరించాలని శాయంపేట సీఐ రంజిత్ రావు కోరారు. శాయంపేట మండలంలో మూడో విడత స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలందరూ ఎన్నికలు శాంతియుతంగా జరుగుటకు సహకరించాలని కోరారు. సీఐ వెంట శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ ఉన్నారు.



# దేవాలయంలో చోరీ

- హుండీల పగలగొట్టి సొత్తును ఎత్తుకెళ్లిన దుండగులు
- కేసు నమోదు.. పోలీసుల దర్యాప్తు

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో దొంగతనం జరిగింది. ఇటీవల షష్టి జాతర ముగిసిన అనంతరం హుండీల్లో నగదు ఉందని గమనించిన గుర్తుతెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి మూడు హుండీలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. హుండీల్లో సుమారు రూ.13 వేల వరకు నగదు ఉండవచ్చని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే సుమారు ఐదు తులాల వెండి కూడా దొంగిలించబడినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆలయ అర్చకులు దహగం రాజేశ్వర శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఫింగర్‌ప్రింట్ నిపుణులతో వేలిముద్రలను సేకరిస్తూ దుండగుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# నర్సంపేటలో బీజేపీ కార్యాలయం ప్రారంభం

నర్సంపేట, అక్షరదర్బార్: నర్సంపేట నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నూతన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, నర్సంపేట మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. వారు జెండా ఆవిష్కరణ చేసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను సందర్శించిన సీపీ



అక్షర దర్బార్, పరకాల: మూడవ విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం దామెర, ఆత్మకూర్, శాయంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. బ్యాలెట్ పత్రాలను తరలించేటప్పుడు అలాగే రేపు జరిగే మూడవ విడత ఎన్నికల వేళ ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్, ఎన్నికల సిబ్బందికి సీపీ కీలక సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట అదనపు డిసిపి బాల స్వామి, ఏ. ఎస్పీ శుభం, ఏసీపీ లు సతీష్ బాబు, సత్యనారాయణ, పరకాల ఆర్డిఓ డాక్టర్ నారాయణతో పాటు స్థానిక ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐలు పాల్గొన్నారు.



# 28 ఎకరాల్లో బస్టాండ్

- జనవరి 25 నుంచి ప్రత్యేక బస్సులు
- ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ వై నాగిరెడ్డి
- మేడారంలో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం




అక్షరదర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు టీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి ఐపీఎస్ తెలిపారు. మంగళవారం తాడ్వాయి మండలం మేడారంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేడారం ఆర్టీసీ బస్టాండ్, బస్సుల పార్కింగ్ ప్రాంగణం, ప్రయాణికుల వేచి ఉండే ప్రాంతాలు, శుభ్రత, తాగునీటి సౌకర్యాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వై. నాగిరెడ్డి మాట్లాడుతూ మేడారం జాతర కోసం 28 ఎకరాల విస్తీర్ణంలో సువిశాల బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని, డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నికల్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రవాణా సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే అటవీ మార్గంలో సిగ్నల్ సమస్య ఉన్నందున ప్రతి కిలోమీటర్‌కు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కమ్యూనికేషన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం అధికారులు శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఆర్టీసీ ఈడీఎం ముని శేఖర్, ఈడి వెంకన్న, ఈడి సాల్మన్, ఆర్‌ఎం విజయ భాను, ఆర్‌ఎం రవిచంద్ర అధికారులు పాల్గొన్నారు.



# చల్లాను కలిసిన లక్ష్మీపురం పాలకవర్గం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని లక్ష్మీపురం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# సోదా నివాళి..

అక్షర దర్బార్, పరకాల: పరకాల సీఎస్ఐ కాలనీ రెండో వార్డుకు చెందిన పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తల్లి పుష్ప అనారోగ్యంతో మృతిచెందగా,




ఆమె పార్థివదేహానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట ఒకటవ వార్డు మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, మడికొండ సుధాకర్, బొచ్చు కరుణాకర్, బొచ్చు జెమిని, చెంగల్‌రావు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి కృషి చేయండి

- ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్ మొగుళ్లపల్లి : గణేష్ పల్లి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మొగుళ్లపల్లి మండలం గణేష్ పల్లి గ్రామ సర్పంచిగా నూతనంగా ఎన్నికైన లింగంపల్లి పద్మ తిరుపతి మంగళవారం హన్మకొండలోని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సర్పంచ్ దంపతులకు శాలువాగప్పి సన్మానించారు అనంతరం ఎమ్మెల్యే నూతనంగా ఎంపికైన సర్పంచులు ప్రజల కష్టసుఖాలలో తోడుండి గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమించాలని తెలిపారు సర్పంచ్ మాట్లాడుతూ.. గణేష్ పల్లి గ్రామ సర్పంచ్ గా మమ్ములను గెలిపించినందుకు ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.



# బీమా చెక్కు అందజేత

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన కొలుగూరి సరోజన భర్త కొలుగూరి రాజేశ్వరరావు చిరు వ్యాపారం నిర్వహించుకునేందుకు సుమారు ఆరు నెలల క్రితం బంధన్ బ్యాంక్ పరకాల బ్రాంచ్‌లో రూ.50 వేల రుణం తీసుకున్నారు. రుణం తీసుకునే సమయంలో ఆయన బీమా సౌకర్యం పొందగా, రూ.లక్ష బీమా చేయించారు. అయితే రెండు నెలల క్రితం రాజేశ్వరరావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీమా నిబంధనల ప్రకారం బంధన్ బ్యాంక్ ద్వారా రూ.లక్ష బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం కొలుగూరి సరోజనకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పరకాల బ్రాంచ్ మేనేజర్ బానోతు నరేష్, ఏరియా మేనేజర్ బాధవత్ శ్రీను, ఏజెంట్ మాలోతు అనిల్ పాల్గొన్నారు.

# మూడోవిడత ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

: కలెక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, నర్సంపేట/చెన్నారావుపేట/ఖానాపూర్/నెక్కొండ: జిల్లాలో మూడో విడతగా బుధవారం జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సంపేట, నెక్కొండ, ఖానాపూర్, చెన్నారావుపేటలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ క్రమబద్ధంగా జరగాలని, పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్ట్ ప్రకారం సామాగ్రిని తనిఖీ చేసుకోవాలని సూచించారు. సమస్యలు తలెత్తితే జోనల్, రూట్ అధికారులకు వెంటనే తెలియజేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రత, మౌలిక వసతులు పక్కాగా కల్పించాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు.







# అర్హులకు త్వరలో ఇందిరమ్మ ఇల్లు

- 2200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లనూ కేటాయిస్తాం
- రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ లో రూ.4.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అక్షరదర్బార్, వరంగల్: అర్హులైన వారికి త్వరలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళ వారం వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలోని 32, 41 డివిజన్లలో రూ.4.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, సైడ్ వాల్ లు, బాక్స్ డ్రైన్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, మేయర్, కమిషనర్, స్థానిక కార్పొరేటర్లు, స్థానిక నాయకుల సహకారంతో ఎక్కడ ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి వారి అవసరం మేరకు అంచనాలు తయారు చేసి వరంగల్ తూర్పు నియోజక వర్గంలో ప్రతి డివిజన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని, స్థలాలు ఉండి ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లను మంజూరు చేస్తామని, స్థలం లేని వారికి రెండు పడక గదుల గృహాలు కేటాయిస్తామని, 2200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నాయని, త్వరలో వాటిని కేటాయిస్తామని అన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరంగల్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం ప్రారంభోత్సవానికి సీఎంను ఆహ్వానించనున్నామని తెలిపారు. రూ.200 కోట్లతో నియోజకవర్గానికి రెసిడెన్షియల్ స్కూల్ ను కేటాయించారని, నియోజకవర్గంలో స్థల లభ్యత లేకపోవడం వల్ల వర్ధన్నపేట నియోజక వర్గ పరిధిలో గల స్థలాని ఎన్ ఓసీ ద్వారా తీసుకోవడానికి కలెక్టర్ క్లియరెన్స్ ఇచ్చారని, ఆది టెండర్ దశలో ఉందని, దానిని కూడా సీఎం చేతులతో పునాది రాయి వేసేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు పల్లం పద్మ రవి, పోశాల పద్మ స్వామి, భోగి సువర్ణ సురేష్, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్ చింతాకుల అనిల్ కుమార్ డీఆర్ ఓ విజయలక్ష్మీ, ఈఈ సంతోష్ బాబు, తహసిల్దార్ మహ్మద్ ఇక్బాల్ డీఈ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## 35 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షరదర్బార్, కాటారం: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో కాటారం, మల్హర్, మహాదేవపూర్, మహా ముత్తారం మండలాల్లో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి.మధ్యాహ్నం వంటి గంట వరకే జరుగుతుందని, ఓటర్లు నిర్దేశించిన సమయంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. మూడో దశలో మొత్తం 81 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహణకు 696 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 98,052 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, వారిలో పురుషులు 47,674 మంది, మహిళలు 50,368 మంది, ఇతరులు10 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈ దశలో 3 గ్రామ పంచాయతీలు,126 వార్డులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 296 మంది, వార్డు సభ్యులకు 1,347 మంది అభ్య ర్థులు పోటీలో ఉన్నారన్నారు. క్రిటికల్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన కేంద్రాల్లో పో లింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు 35 పోలింగ్ కేంద్రా ల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని అన్నారు.





# కబ్జాలను సహించేది లేదు

- పార్కులను అన్యాక్రాంతం కాకుండా చూడాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ. గడిచిన పదేళ్లలో కంటే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మెరుగైన అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రతి కాలనీ అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి 54 వ డివిజన్ శ్రీనగర్ కాలనీ వద్ద రూ.2 కోట్లతో మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటుకు, 9 వ డివిజన్ కాకతీయకాలనీలో రూ.47 లక్షలతో సైడ్ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా 54 వ డివిజన్ ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన ప్రకారం ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు అమలు జరుగుతున్నాయని అన్నారు. మంచి నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులను ప్రారంభించుకోవడం శుభ పరిణామమని అన్నారు. ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. నగరంలో ప్రధానంగా పార్క్ స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు. గడిచిన రెండేళ్ళుగా నగరంలో చాలా వరకు కబ్జాలు తగ్గాయని, ఎవరైనా కబ్జాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ కార్పొరేటర్లు గుంటి రజిత శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, డివిజన్ అధ్యక్షులు నల్ల సత్యనారాయణ, ఎండీ జాఫర్, కాలనీల ప్రజలు, కాలనీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్‌కు కలెక్టర్ డీపీ.. డబ్బులు డిమాండ్

**- సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి**




అక్షరదర్బార్, భూపాలపల్లి : వాట్సాప్ లో కలెక్టర్ డీపీ పెట్టుకుని, తద్వారా సైబర్ నేరగాళ్లు డబ్బులు పంపాలని కోరుతూ మేసేజ్ లు పంపిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం తెలిపారు. తన ఫోటోను ప్రొఫైల్ గా పెట్టుకొని కొందరు దుండగులు వివిధ సంస్థలు, వ్యక్తులకు వాట్సాప్ సందేశాలు పంపి డబ్బులు అడుగుతున్నారని తెలిపారు. ఇటువంటి సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని, అలాంటి వారికి డబ్బులు ఇవ్వకూడదని కలెక్టర్ కోరారు. తన పేరు, ఫోటోతో, హోదాతో ఇలాంటి సందేశాలు రావని, అవి పూర్తిగా నకిలీవని స్పష్టం చేశారు. ఇలాంటి మెసేజ్ లు అందిన వెంటనే సంబంధిత వాట్సాప్ నంబర్లను బ్లాక్ చేయాలని, సైబర్ క్రైమ్ పోలీసులకు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఆకట్టుకునేలా గ్రీన్ పోలింగ్ కేంద్రాలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద**

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లాలో మూడవ విడతలో బుధవారం జరగనున్న ఎన్నికలకు పలు పోలింగ్ కేంద్రాలను గ్రీన్ పోలింగ్ కేంద్రాలుగా సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో మూడవ విడతలో బుధవారం జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రీన్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను ఆకుపచ్చని తోరణాలతో స్వాగతం పలుకుతూ గ్రీన్ మ్యాట్లు వేశారు. ఈ పోలింగ్ కేంద్రాల ముందు ఓటర్లను ఆకట్టుకునే విధంగా ముగ్గులు వేశారు. వయో వృద్ధులు, దివ్యంగుల సౌకర్యం కొరకు విల్ చైర్ లను ఏర్పాటుచేశారు. ఈ మేరకు నర్సంపేట మండలం లక్నేపల్లి, ఇటుకాలపల్లి, పోలింగ్ కేంద్రాలు, ఖనాపూర్ మండలం ఖనాపూర్, రాగంపేట పోలింగ్ కేంద్రాలు, చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి, తిమ్మరాయనిపహాడ్ పోలింగ్ కేంద్రాలు, నెక్కొండ మండలం రెడ్లవాడ, ఆలంఖానిపేట్ పోలింగ్ కేంద్రాలను ఓటర్లను ఆకట్టుకునేలా హరిత పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దినట్లు కలెక్టర్ తెలిపారు. ఆహ్లాదకరమైన, వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఓటర్లను కలెక్టర్ కోరారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915